తేదీ 02.05.2006, సాయిరమేశ్ క్రిషన్ హాలు (బృందావనం)

# దేహమే దేవాలయం, నీవే దైవం

సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
    విద్యలన్నియు నేర్చిన విలువ సున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
    దాన ధర్మాల సార్థకత సున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
    పదవుల నేలిన ఫలము సున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
    బహుళ సత్కార్య లాభంబు సున్న
ఈ సనాతన ధర్మ హర్మ్యంబు నిలువ
గుణము లియ్యవి నాల్గు పునాదులప్ప
ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పఱతు?
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!

**ప్రేమస్వరూపులారా!**

పరమ ప్రేమస్వరూపుడైన పరమాత్మ జగత్తును సంరక్షించడానికై అవతరిస్తుంటాడు. అవతరించుట అనగా ఏమిటి? ప్రేమ ప్రజ్ఞ, లోక ప్రజ్ఞ - ఈ రెండింటియొక్క ఏకత్వమే అవతారము. దేహమనో బుద్ధులతోకూడిన స్వరూపమే ప్రకృతి. ఇట్టి ప్రకృతి నిమిత్తమై భగవంతుడు తానుకూడా ప్రకృతికి సమన్వయమైన స్వరూపముతో రావాలి. ప్రజలను సరియైన మార్గమునకు తెప్పించి, వారిలో పరివర్తన గొని రావడమే భగవంతుని ప్రధాన లక్ష్యం.

sri sathyasai vachanamrutam

## తేదీ 02.05.2006, సాయిరమేశ్ క్రిషన్ హాలు (బృందావనం)

ఒకనాడు గోపికలు యశోద దగ్గరకు వచ్చి, "అమ్మా! అర్ధరాత్రి వేళ మా మిద్దెలెక్కి వచ్చి కృష్ణుడు నిద్రపోవు స్త్రీల జడలెత్తి కట్టి పరుగెత్తి పోయినాడు", మొరపెట్టుకున్నారు. అప్పుడు కృష్ణుడు, 'అమ్మా! నేను నీదు పక్కలో కదలక మెదలక పడుకొని యుంటిని. అర్ధరాత్రి వేళ నేనెపుడు వెళ్లి వస్తినమ్మా? నీవే చెప్పు" అన్నాడు. యశోదకూడా, 'నిజమే. కృష్ణుడు నా దగ్గరే ఉండగా వీళ్ళందరూ తమవద్దకు వచ్చినట్లు అబద్ధం చెబుతున్నారు' అని నిర్ణయించుకున్నది.

తరువాత మరో గుంపు యశోద దగ్గరికి వచ్చి, "అమ్మా! గొల్లభామలంత గూడి చల్లనమ్మ పోవుచుండ, చల్లబానలకు సుంకమిమ్మని చిల్లులు పడగొట్టినాడు", అని ఫిర్యాదు చేశారు. యశోద, 'కృష్ణా! ఇటువంటి తుంటరి చేష్టలను మానుకో. లేనిచో నిన్ను రోటికి కట్టి వేస్తాను', అని మందలించింది. అప్పుడు కృష్ణుడు, "అమ్మా! నేను ఎవరి జడలూ కట్టలేదు, ఎవరింట్లోనూ కుండలు కొట్టలేదు. అదంతా వారి భ్రమ. వారి భ్రమలే వారిని బాధిస్తున్నాయి", అన్నాడు. ఆధ్యాత్మిక పరిభాషలో కుండ అనగా దేహము. కుండను కొట్టడమంటే దేహభ్రాంతిని కొట్టడమని అర్థం.

**గుణాతీతునికి గుణముల నాపాదించడం అజ్ఞానం**

ఆ తర్వాత గోపికలు వచ్చి, 'కృష్ణా! నీవు బ్రహ్మానంద స్వరూపుడవు, ద్వంద్వాతీతుడవు, త్రిగుణ రహితుడవు, భావాతీతుడవు. నీకు గుణముల నాపాదించడం మా దోషమే! మేము నీ తల్లిదగ్గర చేసిన ఫిర్యాదులన్నీ అజ్ఞాన జనితమైనవి. దయచేసి మమ్మల్ని క్షమించి, రక్షించు స్వామీ!' అని ప్రార్థించారు. కృష్ణుడు వాళ్ళను క్షమించి అందరినీ తన సన్నిధిలో చేర్చుకున్నాడు. 'మీరు వేరు, నేను వేరు కాదు. నేను, మీరు ఒక్కటే', అని వాళ్ళకు బోధించాడు. అట్టి ఏకత్వాన్ని మనము విశ్వసించినప్పుడు ఎంతైనా బాగుపడతాము. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక తత్త్వములు మూడింటియందు మనము ఏకత్వాన్ని అనుభవించాలి.

**త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం**
**త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణం**

మనము జన్మించినది పాపపరిహారముకోసమేగాని, పాపములను అభివృద్ధి

srisathyasaivachanamrutam

పరచుకోవడంకోసం కాదు.

మానవులు చంచల స్వభావులు. మానవత్వము దేహ, మనోవాంఛలతోను, కామక్రోధాదులతోను కూడి వుంటుంది. ఇది 'నెగెటివ్'. దీనిని దైవత్వమనే 'పాజిటివ్'తో చేర్చేసేయండి. అప్పుడు 'నెగెటివ్' కూడా 'పాజిటివ్'గా మారిపోతుంది. దైవత్వమునందు దేహవాంఛలు, మనోభీష్టములు, కామ క్రోధములు ఏమాత్రము ఉండవు. త్రిగుణాతీతుడైన భగవంతునికి ప్రాకృతమైన భావములను కల్పించడం మహాపాపం. భగవంతుడు ఏది చేసినా, ఏది చూసినా, ఏది చెప్పినా అంతా కేవలం భక్తోద్ధరణకోసమేగాని తనకోసం కాదు. భగవంతుడు మానవాకారముతో వచ్చినప్పుడు మానవునివలెనే ప్రవర్తిస్తుంటాడు. ఒకరిని కొడతాడు, ఒకరిని నవ్విస్తాడు, ఒకరితో ఆటలాడుతుంటాడు. ఈవిధమైన చర్యలను పురస్కరించుకొని కొందరు అవతారమూర్తిని సామాన్య మానవునిగా భ్రమిస్తారు. అసలు భగవంతుడు దేహమును ధరించి దివినుండి భువికి దిగి రావడం ఎందుకోసం? మానవులకు ఆదర్శాన్ని నిరూపించి, లీలలను చూపించి, తన లక్ష్యమును సాధించే నిమిత్తం మానవాకృతిని ధరించి అవతరిస్తుంటాడు.

**'ఏకోహం బహుస్యాం'**

'నీ పేరేమిటి?' అని ఎవరైనా మిమ్మల్ని అడిగితే, 'నా పేరు రంగన్న', 'నా పేరు సోమన్న' అని మీరు చెప్పుకుంటారు. అయితే, రంగన్న, సోమన్న అనేవి మీరు పుట్టిన తరువాత మీ తల్లిదండ్రులు పెట్టిన పేర్లేకాని, మీ నిజమైన పేర్లు కావు. 'నీవెవరు?' అని అడిగితే 'నేను నేనే' అని జవాబు చెప్పాలి. మీకు ఎవ్వరూ పెట్టనటువంటి పేరు 'నేను' (I). ప్రతి ఒక్కరియందుకూడను ఉన్నటువంటిది 'నేను'. అదే ఆత్మతత్త్వము. అది తప్ప మిగిలినవన్నీ కల్పితములే. ప్రతి మానవునియందును దైవత్వం ఉన్నది. సర్వ మానవులూ దైవస్వరూపులే! 'ఏకోహం బహుస్యాం', భగవంతుడు ఒక్కడే అన్నిరూపములను ధరించాడు.

వ్యష్టి, సమష్టి, సృష్టి – ఈ మూడూ అవినాభావ సంబంధము గలవి. పరమేష్ఠి నుండి ఆవిర్భవించినటువంటిది సృష్టి, సృష్టినుండి వచ్చినటువంటిది సమష్టి. కాబట్టి, సమష్టిలో అందరూ ఒక్కటే. ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనే భేదము లేదు. ఎవరు ఎవరిని తిట్టినా

sri sathyasai vachanamrutam

తనను తాను తిట్టుకున్నట్లే. ఎందుకంటే, మనకు కనిపించేదంతా మన ప్రతిబింబమే! మనకు వినిపించేదంతా మన ప్రతిధ్వనియే! ఇట్టి సత్యాన్ని గుర్తించాలి. ఏకత్వాన్ని అనుభవించాలి. రాముడు, కృష్ణుడు అనేవి వాళ్ళ తల్లిదండ్రులు పెట్టిన పేర్లు. భగవంతుడు అవతరించినప్పుడు 'నేను రాముడను', 'నేను కృష్ణుడను' అని చెప్పుకోలేదు. ఈ పేర్లు వాళ్ళు పుట్టిన తరువాత పెట్టినవేగాని, పుట్టక పూర్వము ఉన్నవి కావు.

**'నేనే దైవం' అని విశ్వసించాలి**

దైవాన్ని ఎక్కడకూడను వెతుకనక్కరలేదు. దైవం ఎక్కడున్నాడంటే, 'నేనే దైవం' అని ధైర్యంగా నీవు చెప్పగల్గాలి. ఏకత్వాన్ని పూనాలి. రాళ్ళతో, సిమెంటుతో కట్టిన బిల్డింగుల్లో, దేవాలయాల్లో మీరు దేవుణ్ణి ప్రతిష్ఠ చేస్తున్నారుగాని, నిజానికి భగవంతుడు అందరిలోనూ ప్రతిష్ఠితుడై ఉన్నాడు. దీనిని పురస్కరించుకొనియే 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః', 'అందరియందు నేనే ఉన్నాను', అని ప్రకటించాడు కృష్ణ పరమాత్మ. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలచేత మనము ఈ సత్యాన్ని గుర్తించడానికి వీలవుతుంది. సత్యమెక్కడుంది? బయట ఉన్నదా? లేదు. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ అన్నీ మనదగ్గరనే ఉన్నాయి. అన్నీ మనదగ్గరనే పెట్టుకొని ప్రతిబింబాలకోసం మనము బయట వెతుకుతున్నాము. ప్రతిబింబాలను వెతుకుతూ ఉన్నంతవరకు బింబము మనకు గుర్తుకు రాదు. దైవత్వము మనయందే ఉన్నది. కాబట్టి, 'నేనే దైవం' అని మీరు భావించుకోవాలి. అప్పుడు ఎట్టి భయముగాని, ఎట్టి దిగులుగాని, ఎట్టి భ్రాంతి గాని ఉండదు మనకు. మనల్ని మనం దైవంగా భావించకుండా ఉండినంతవరకు దేహ భ్రాంతిని వదల్లేము.

**సంబంధ బాంధవ్యాలన్నీ భ్రాంతులే!**

ఒక అమ్మాయికి, ఒక అబ్బాయికి పెండ్లి జరిగిన తరువాత ఆమె 'ఇతను నా భర్త' అంటుంది. కాని, భర్త ఎంతవరకు ఉంటాడు? కొంతకాలం ఉంటాడు. భార్య ఎంతకాలం ఉంటుంది? కొంతకాలం ఉంటుంది. తదుపరి ఒకరికొకరికి మధ్య ఏమాత్రము సంబంధముండదు. భర్త ఎవరు? భార్య ఎవరు? ఇది కేవలం 'ఇమేజినేషన్' మాత్రమే!

srisathyasaivachanamrutam

ఎన్నో సంవత్సరాలు తనను ఎంతో ప్రేమతో పెంచి పోషించిన తల్లి అకస్మాత్తుగా శరీరమును వదిలేసరికి ఆమె మృత శరీరముపై పడి కుమారుడు, 'తల్లీ! నన్ను విడిచిపోతివా?' అని విలపిస్తుంటాడు. ఎక్కడికి పోయింది అతని తల్లి? తాను 'అమ్మా' అని పిలుస్తూ వచ్చిన దేహము అక్కడే ఉందే! నిజంగా ఆ దేహమే తన తల్లి అయితే ఆ దేహాన్ని ఇంట్లో పెట్టుకోవచ్చు కదా! కాని, అలా చేస్తాడా? చేయడు. ఆ దేహాన్ని తీసుకు వెళ్ళి భస్మం చేస్తాడు. కాబట్టి, ఇవన్నీ భ్రాంతులే తప్ప ఇందులో సత్యము ఏమాత్రము లేదు. ఇవన్నీ కదలిపోయే మేఘాలవంటివి. ఆత్మ ఒక్కటే శాశ్వతము. ఏమి జరిగినప్పటికీ ఆత్మ ఏమాత్రము కదలదు, మార్పు చెందదు. మీరే ఆత్మస్వరూపులై వుండి ఆత్మ ఎక్కడో ఉన్నదని భ్రమించి దానికోసం వెతుకుతున్నారు. ఆత్మ అంటే ఏమిటి అర్థము? చైతన్యమే. సర్వత్రా నిండియున్నది చైతన్యమే. సర్వం చైతన్యమయమే. మన దేహంలో చైతన్యం ఉన్నంతవరకు మన బంధుమిత్రులు మనకు ఎన్నో విధాలుగా గౌరవ, మర్యాదలు చేస్తుంటారు. దేహంలోనుండి చైతన్యం తొలగిపోయిన తక్షణమే వారే దీనిని తీసుకువెళ్ళి నిర్దాక్షిణ్యంగా నిప్పులో వేస్తారు.

### మనసు మంచిదైతే అంతా మంచే జరుగుతుంది

మనమంతా దైవస్వరూపులమే! కాని, దైవం మనకంటే వేరుగా ఉన్నాడనే భ్రాంతిచేత, మనము భజన, ధ్యానము, జపములు చేసుకుంటూ కాలము గడుపుతున్నాము. ధ్యానం పేరిట ఊరికే కళ్ళు మూసుకొని కూర్చునే బదులు భగవత్తత్త్వమును అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి.

**శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్**

ఇవి మనము చేయవలసిన నవవిధ సాధనలుగా భావిస్తున్నాము. 'సాధన' అనే పదములో 'సా' అనగా సాలోక్య, సారూప్య, సామీప్య, సాయుజ్యములు. ఈనాటి మానవుడు 'సా' అనేదానిని మరచిపోయి 'ధన'ముకోసం ప్రాకులాడుతున్నాడు. ధనముతోనే సర్వము



sri sathyasai vahinamrutam

జరుగుతున్నది. ఒక పాట పాడమనిగాని, ఒక పని చేయమనిగాని ఎవరినైనా అడిగితే 'ఎంతిస్తావు?' అని బేరమాడతారు. ఈనాడు ప్రతి ఒక్కటీ 'బిజినెస్' క్రింద మారిపోయింది; చివరికి భక్తిని కూడా వ్యాపారంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. భగవంతుణ్ణి డబ్బిచ్చి కొనవలసిన అవసరం లేదు. నీవే భగవంతుడవు. నీలోనే ఉన్నది భగవత్తత్త్వము. నీయందు లేని శక్తి, సామర్థ్యములు ఇంకెక్కడా లేవు. నీ మనసును నిశ్చలంగా, పవిత్రంగా ఉంచుకో. అటూ ఇటూ 'జంప్' చేయనీయవద్దు. నీ మనను మంచిగా ఉంటే నీకన్నీ మంచిగానే జరుగుతాయి. మనసులో చెడ్డ భావాలుంటే ఫలితంకూడా చెడ్డదిగానే ఉంటుంది. Do good, be good, see good. మనం మంచిగా ఉండాలి. సరియైన మార్గములో నడుచుకోవాలి. ప్రాకృత జీవుల మాటలను విశ్వసించి నీవు తప్పుదారిలో పోవద్దు. నీ హృదయాన్ని నీవనుసరించు. నీ హృదయము పవిత్రంగా ఉంటే నీ జీవితంలో సర్వమూ పవిత్రమైపోతుంది.

**ఆకారమును మరచిపో, దైవభావాన్ని స్థిరం చేసుకో!**

భగవంతుని దగ్గరకు వెళ్ళేందుకు మనం దూర ప్రయాణం చేయనక్కర్లేదు.

**సర్వతః పాణి పాదం తత్సర్వతోక్షి శిరోముఖం**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి**

ఎక్కడ చూసినా ఉన్నది భగవంతుడే! భగవంతుడు లేని స్థానము లేదు. భగవంతుడు కాని రూపము లేదు. ప్రతి మానవుడు దైవాన్ని ఎక్కడో వెతకడానికి ప్రయత్నిస్తున్నాడు. నీ ప్రక్కన కూర్చున్నదీ దైవమే. నీ ఎదురుగా కనిపించేదీ దైవమే. నీ వెనుక నడిచేదీ దైవమే. అంతా దైవమే. కాని, నీ చుట్టూ ఉన్నవారిని నీవు దైవస్వరూపులుగా చూడడం లేదు; మానవాకారులుగా నీవు చూస్తున్నావు. ఆకారమును మరచిపో. దైవభావాన్ని స్థిరం చేసుకో. 'నా ముందు, వెనుక ఎక్కడ చూసినా ఉన్నది దైవం ఒక్కడే', అని విశ్వసించు. భగవంతుడే మనకు సర్వమును సమకూరుస్తున్నాడు. కాబట్టి, నీవు ఏ పని చేసినా అది దైవకార్యంగా భావించు, దైవార్పితం గావించు. దైవార్పిత భావంతో నీవు కర్మలనాచరిస్తే అన్నీ పవిత్రంగా మారిపోతాయి. మొట్టమొదట మన మనస్సుయొక్క తత్త్వాన్ని గుర్తించాలి. భగవంతుడు

sri sathyasaivachanamrutam

ఎక్కడో లేదు. నీవే దైవం. You are God. You are everything. సమాజము నీవే. ప్రపంచము నీవే. ఆకాశము నీవే. భూమి నీవే. నక్షత్రములు నీవే. అన్నియు నీవే. కనుక, 'సర్వము నేనే' అనే తత్త్వాన్ని మొట్టమొదట మనసులో దృఢం చేసుకోవాలి. 'ఏకోహం బహుస్యాం', 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి'. మనం పేర్లను, రూపాలను ఆధారం చేసుకోవడంవలన భిన్నత్వం గోచరిస్తున్నదే గాని, నామరూపాలకు అతీతంగా విచారిస్తే సర్వత్రా ఏకత్వమే సాక్షాత్కరిస్తుంది.

**వాంఛలకు ఓ హద్దూ పద్దూ ఉండాలి**

ఈ ప్రపంచంలో ప్రతి వస్తువుకు ఒక 'లిమిట్' (పరిమితి) ఉన్నది. 'లిమిట్' లేకుండా ఏ వస్తువూ లేదు. కాని, ఈనాడు సమాజమంతాకూడను 'లిమిట్' దాటిపోతున్నది. మన దేహమే ఒక 'లిమిటెడ్ కంపెనీ'. ఇటువంటి దేహముతో మనము 'లిమిట్' లేకుండా ప్రవర్తిస్తుంటే మన గతి ఏమవుతుంది! కనుక, మనము హద్దులెరిగి వర్తించాలి. వైద్యుడు రోగికి మందిచ్చేటప్పుడు ఇన్ని పూటలు, ఇన్ని ఔన్సులు దీనిని త్రాగాలి అని చెబుతాడు. ఆ 'లిమిట్' దాటి దానిని ఎక్కువగా త్రాగితే ఇంకో జబ్బు వస్తుంది. అదేవిధంగా, భగవంతుడుకూడను ప్రతి మానవునికి ఒక్కొక్క 'లిమిట్' ఏర్పరచాడు. అహంకారంచేత ఆ 'లిమిట్' దాటిపోతే మనము ప్రమాదానికి గురి అవుతాము. కాబట్టి, మన వాంఛలను హద్దులో ఉంచుకోవాలి.

ఈనాడు మనము అనేక రకములైన బంధుత్వాన్ని పెంచుకుంటున్నాము. అన్నీ జగత్తుయొక్క సృష్టియే! మొదట నీవు ఒక్కడవే ఉన్నావు. తరువాత పెండ్లి చేసుకున్నావు. కొడుకు పుట్టాడు, కూతురు పుట్టింది. తరువాత మనుమడు పుట్టాడు, మనుమరాలు పుట్టింది. ఈవిధంగా పరిమితము లేకుండా సంబంధ బాంధవ్యాలు పెరిగిపోతున్నాయి. దీనికి కారణం నీ విషయవాంఛలే తప్ప వేరు కాదు. విషయవాంఛలను తగ్గించుకుంటే నీవు ఎంతైనా బాగుపడతావు. Less luggage, more comfort makes travel a pleasure. నీ లగేజిని కొంచెం తగ్గించుకో. అందుకు తగిన ధైర్యసాహసాలను పెంచుకో. ధైర్యముగాని, సాహసముగాని పరులు అందించేవి కావు. నీ ధైర్యాన్ని, నీ సాహసాన్ని నీవే సంపాదించుకోవాలి. నీ సహనాన్ని నీవే పెంపొందించుకోవాలి.

srisathyasaivachanamrutam

**'మానవుడు' అనే పేరుకు తగినట్లు ప్రవర్తించండి**

ప్రేమస్వరూపులారా! స్త్రీలుగాని, పురుషులుగాని ఇంద్రియ నిగ్రహాన్ని సాధించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలి. ఈనాడు ఇంద్రియాలపై 'కంట్రోలు' లేకపోవడంచేతనే అనేక రకములుగా అశాంతి పెరిగిపోతున్నది. కోరికలకు హద్దూ పద్దూ అనేది లేకుండా పోతున్నది. హద్దూ పద్దూ లేనప్పుడు ఎద్దువలె తిరుగుతుంటారు. మీరు పశువులమాదిరి తయారు కాకూడదు. మీలో ఏవైనా దుర్గుణాలు తలెత్తినప్పుడు 'నేను మనిషిని, పశువును కాను' అని మిమ్మల్ని మీరు హెచ్చరించుకోవాలి. కోపం పశులక్షణం. కోపమొచ్చి నప్పుడు అవి ఒకదానితో ఒకటి పోట్లాడుకుంటాయి. ఈనాడు పశువులవలె మనుషులుకూడా పోట్లాడుకుంటున్నారు. మనిషికి అసలు కోపమే రాకూడదు. ఒకవేళ కోపం వచ్చినప్పటికీ దానిని నిగ్రహించుకోవాలి. శాంతంగా ఉండాలి. శాంతమును పోషించుకున్నప్పుడు అశాంతికి ఏమాత్రం అవకాశముండదు. ఈనాడు మనుషులకంటే పశువులే మేలనిపిస్తున్నది. పశువులకైనా ఒక సీజను, రీజను ఉంటాయి. కాని, ఈనాటి మానవునికి 'నో సీజన్', 'నో రీజన్'! పశువులకంటే హీనమైపోతున్నాడు, నేటి మానవుడు. 'నేను మానవుడను' అనుకున్నప్పుడు ఆ పేరుకు తగినట్లు ప్రవర్తించాలి. మానవత్వాన్ని పోషించుకోవాలి. మానవతా వివేకాన్ని, మానవతా విచక్షణను అభివృద్ధిపరచుకోవాలి. అప్పుడే 'నేను మానవుడను' అని చెప్పుకోవడానికి మీకు అధికారముంటుంది.

**శాంతి బయట లేదు; మీయందే ఉన్నది**

ప్రేమస్వరూపులారా! సత్యమార్గముననుసరించండి. ఎట్టి పరిస్థితులందైనా అసత్యంలో ప్రవేశించకండి. శాంతి ఎక్కడుంది? మీయందే ఉన్నది. బయట ఉందేమోనని మీరు వెతుకుతున్నారు. Peace బయట లేదు. బయటంతా Pieces, Pieces! శాంతిని, ఆనందమును బాహ్య జగత్తులో పొందడానికి వీలుకాదు. జపం చేస్తే ఆనందము కలుగుతుందని భావించి జపం చేస్తున్నారు. చేతిలో జపమాల తిరుగుతుండాదేగాని, శాంతి ఏమాత్రం లభించడం లేదు. 'స్వామీ! మాకు మనశ్శాంతి కావాలి', అని చాలామంది నన్ను అడుగుతుంటారు. మనశ్శాంతి మీదగ్గరనే ఉన్నదే! నాకు ఎప్పుడుకూడను అశాంతి అనేది

sri sathyasai vachanamrutam

కలుగలేదు. నేనెప్పుడూ శాంతంగానే ఉంటాను. ఎందుకంటే, నా స్వరూపమే అది. మీరు శాంతి కోల్పోవడానికి ఏది కారణము? కోరికలే! కనుకనే, జీవిత ప్రయాణంలో కోరికలనే 'లగేజి'ని తగ్గించుకోండని చెబుతుంటాను. కోరికలెంత తగ్గిపోతే మన భారము అంత తగ్గిపోతుంది.

ఏది వచ్చినప్పటికీ 'ఇది నా మంచికోసమే, నా మంచికోసమే, నా మంచి కోసమే', అని భావన చేసుకోండి. ఈవిధమైన సద్భావనను పెంచుకుంటే అంతా మంచిగా మారిపోతుంది. మంచి అనేది ఎక్కడో బయటలేదు; మనయందే ఉన్నది. ప్రతి విషయాన్ని మనము శాంతంగా, నెమ్మదిగా విచారణ చేసుకోవాలి. ఎల్లప్పుడు ఆనందంగా ఉండాలి. మొట్టమొదట మీరు మానవత్వమంటే ఏమిటో గుర్తించండి. సత్య, ధర్మ, శాంతి, ప్రేమలతోకూడినదే మానవత్వము. అవి నాలుగూ మన దగ్గర ఉంటే నిరంతరము మనము శాంతిని అనుభవిస్తాము; మన మోముపై చిరునవ్వులు చిందులు త్రొక్కుతాయి. కాని, మనస్సు సరియైనరీతిలో లేనప్పుడు అన్నివిధాలుగాను అశాంతిని అనుభవించవలసి వస్తుంది.

**దుర్గుణాలకు హృదయంలో చోటివ్వకండి**

ప్రేమస్వరూపులారా! మీరు కేవలం మానవాకారులు కాదు; మీలో మాధవత్వ మున్నది. ఈ సత్యాన్ని గుర్తించుకోండి. మిమ్మల్ని మీరు మానవులుగా భావించుకున్నంతవరకు మీకు అశాంతి తప్పినది కాదు. ఒక్కొక్కతూరి ఆహార, విహారములచేత కొన్ని మార్పులు కలుగుతుంటాయి; క్రోధము, అసూయ వంటి దుర్గుణాలు తలెత్తుతుంటాయి. వాటిని తక్షణమే అణచివేయాలి. దుర్గుణాలకు హృదయంలో చోటివ్వకూడదు. మనమొక ఇల్లు కట్టుకున్నాము. దానికి తలుపులు పెట్టుకున్నాము. తలుపులున్నాయి కదా అని వాటిని తెరచి గాడిదలను, పందులను, పాములను, తేళ్ళను లోపలికి వదులుతామా? వదలము. ఒకవేళ అవి లోపలికి రావడానికి ప్రయత్నిస్తే తక్షణమే తలుపులు వేస్తాము. మన హృదయానికికూడా 'కంట్రోలు' అనే తలుపు ఉంటుండాది. దానిని వేసుకోండి. అప్పుడు దుర్గుణాలనే విషపురుగులు హృదయంలోకి ప్రవేశించలేవు. మనము ఎవరినీ

sri sathyasai vachanamrutam

దూషించకూడదు, ఎవరినీ హింసించకూడదు. అటువంటి పరిస్థితులేమైనా తలెత్తినప్పుడు మిమ్మల్ని మీరు కంట్రోలు చేసుకోండి. మీకు క్రోధం వస్తే, 'ఛీ, ఇది నా శత్రువు', అని తక్షణమే దానిని అణగద్రొక్కండి. "తన కోపమె తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ, తన సంతోషమె స్వర్గము ..." మన హృదయంలో దయ, ప్రేమలను నింపుకున్నప్పుడే మనము దైవాన్ని చూడగల్గుతాము. ప్రేమ లేనివానికి దైవం కనిపించదు; దయ్యమే కనిపిస్తుంది. 'దైవత్వం నాయందే ఉన్నది. నేనే దైవం. ఈ దేహమే దైవమందిరం' – ఈవిధమైన విశ్వాసాన్ని అభివృద్ధిపరచుకున్నప్పుడు ఈ కోప, తాప, అసూయ, డంబములు ఏమాత్రము మనలను బాధించవు. కనుక, మీరు దయను, ప్రేమను పెంచుకోండి బంగారూ!

ఏ సమయమునందైనా, ఎచ్చోటనైనా ఎన్ని మారినప్పటికీ సత్యము మారేటటువంటిది కాదు. 'అడవులయందున్న ఆకసముననున్న పట్టణమున నున్న పల్లెనున్న...' ఎందుండినను సత్యము సత్యమే. ప్రేమ ప్రేమయే. ప్రేమ మీలో ఉన్నప్పుడు సత్యము కూడా వచ్చి చేరుతుంది. సత్యము మీదగ్గర ఉన్నప్పుడు ప్రేమకూడా వచ్చి చేరుతుంది. మీరందరూ ప్రేమతోనే పుట్టారు. కాని, పెరిగి పెద్దవారయ్యేకొలదీ మీలో ప్రేమ క్షీణించి, అసూయా ద్వేషాలు పెరిగిపోతున్నవి. అసూయ అనేది చాలా చెడ్డది. దీనివల్ల మానవుడు పరులకు చెడుపు చేయడమే కాక తనకు తాను చెడుపు చేసుకున్నవాడవుతాడు. కనుక, ఇట్టి దుర్గుణాలకు మీలో చోటివ్వక ప్రేమతత్త్వాన్ని, సత్యవాక్కును పోషించుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడే మీరు నిరంతరము శాంతిని అనుభవించగలరు.

**(తేదీ 02.05.2006, సాయిరమేశ్ క్రిషన్ హాలు (బృందావనం)**

sri sathyasaivachanamrutam